క్లుప్తంగా

కంటి అద్దాలు అందజేత



నవాబుపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. కోస్గికి చెందిన ఆర్‌బీఎస్‌కే సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నవాబుపేటతో పాటు ఇప్పటూర్, యన్మన్‌గండ్ల, కారుకొండ జెడ్పీ స్కూల్ విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగ్యానాయక్, సీఆర్పీ జనార్దన్, వైద్యులు డా.ప్రవీణ్, హబీబ్, పార్వతి, చంద్రకళ, వనజ ఉన్నారు.

రేపు కబడ్డీ పోటీలు

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తిలో మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి స్మారకార్థం గురువారం వీరహనుమాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ ఆర్గనైజర్స్ భాస్కర్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో బహుమతులుగా రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్: 96033 54369, 9182871213కు సంప్రదించాలని కోరారు.

కొల్లూర్‌లో వైద్య శిబిరం

నవాబుపేట: మండలంలోని కొల్లూర్ గ్రామంలో విజయ కార్డియాక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. మంగళవారం ఈ వైద్య శిబిరాన్ని ఎస్‌ఐ విక్రమ్ ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు డా.చందులాల్ రాథోడ్ బృందం గ్రామంలోని 310 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి కావాల్సిన మందులు అందించారు. కార్యక్రమంలో డా.విజయలక్ష్మి రాథోడ్, మార్కెట్ వైస్ చైర్మన్ తులసీరాం నాయక్, చందర్‌నాయక్, ఖాజా, శివకుమార్, లింబ్యానాయక్, శ్రీనివాస్, చెన్నకేశవులు ఉన్నారు.

పండ్లు పంపిణీ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): శ్రీ లక్ష్మీనారాయణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో పలు ప్రాంతాల్లో పండ్లు పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా సేవా సంస్థ అధ్యక్షుడు అనంద్ మాట్లాడుతూ 51సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. కవిత, ఎం.పల్లవి సిరివల్లి, హరిచరణ్ పాల్గొన్నారు.

అధిక నిధులు కేటాయించాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో విద్యకు 30శాతం నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి మంగళవారం క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు బకాయిలు ఉన్నాయని, అధిక మొత్తంలో నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భరత్, ప్రశాంత్, బన్ని, ఈశ్వర్, రమేష్ పాల్గొన్నారు.

బిల్లులు విడుదల చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): డీఆర్‌డీఓ శాఖలో అధికారులకు నడుస్తున్న అద్దె వాహనాలకు చెందిన పెండింగ్ బిల్లును వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్, హైర్ వెహికిల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సల్లావుద్దీన్ కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో పీఆర్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో మెయింటనెన్స్ చేయడానికి అప్పులు చేయాల్సి వస్తుందని వాపోయారు. ఫోర్ వీలర్స్ డ్రైవర్స్, హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లాఅధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హన్వాడ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. మండలంలోని బుద్దారంవాగు నుంచి కారంతండాకు చెందిన గూన్యానాయక్ అనుమతుల్లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు ట్రాక్టర్ యజమాని గూన్యానాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

జడ్చర్ల: సాయినగర్‌కాలనీలో తాళం వేసి ఊరు వెళ్లిన రెండు ఇళ్లల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. సీఐ కమలాకర్ తెలిపిన వివరాలు.. లింగంపేటకి చెందిన మల్లికార్జున్ సాయినగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో ఇంటికి తాళంవేసి తమఊరు వెళ్లారు. సోమవారం రాత్రి ఇంటి తాళాలు విరగ్గొటి ఇంట్లోకి వెళ్లిన దొంగలు బీరువాలో దాచిన 2తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. ఇదే కాంప్లెక్స్‌లోని మరోఇంట్లో కరీంనగర్‌కు చెందిన మనోహర్‌రెడ్డి ఉద్యోగం రీత్యా అమెరికా వెళ్లాడు. భార్య పుట్టింటికి వెళ్లింది. వీరి ఇంటి తాళాలు విరగ్గొట్టి ఇంట్లోని బీరువాలో సొత్తు కోసం గాలించారు. ఇంట్లో ఎలాంటి సొమ్ము లభించనట్లు తెలిసింది. ఎస్‌ఐ జయప్రసాద్ ఘటనాస్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రతి గడపకూ 'సంక్షేమం'



జమిస్తాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ హయాంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ధర్మాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో వాటర్‌ప్లాంట్ ప్రారంభం

మహబూబ్‌నగర్ రూరల్: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద కోడూర్‌లో రూ.40 లక్షలతో, అప్పాయిపల్లి రూ.10లక్షలతో ఓబ్లాయిపల్లిలో రూ. 50లక్షలతో, జమిస్తాపూర్‌లో రూ. 40లక్షలు, ధర్మాపూర్‌లో రూ. 40 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, అండర్ డ్రైయినేజీ, ఇతర అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ధర్మాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ముడా నిధులతో ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్లుగా విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని అన్నారు. కనీస మౌలిక సదుపాయాలను కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కల్పించలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ రేషన్ కార్డులు వస్తాయని, అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, ఎంపీడీఓ కరుణశ్రీ, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు రామచంద్రయ్య, శ్రీనివాస్‌యాదవ్, గోవింద్ యాదవ్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, మల్లు అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలించాలి

కలెక్టర్ విజయేందిర బోయి.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

కోయిల్‌కొండ: ఎండుముఖం పడుతున్న పంటలకు సాగునీరు అందించేందుకు వీలుగా అధికారులు ఏవైనా ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉంటే పరిశీలించాలని కలెక్టర్ విజయేందిరబోయి సూచించారు. మంగళవారం మండలంలోని సంగనోనిపల్లి, శేరివెంకటాపూర్ గ్రామాల్లో రైతులు యాసంగిలో వేసుకున్న వరి పంటసాగును ఆమె పరిశీలించారు. బోరు బావుల కింద సాగవుతున్న వరిపైరు ఏస్థితిలో ఉంది, సాగునీటి లభ్యత ఏ మేరకు అందుబాటులో ఉందన్న అంశాలను క్షేత్రస్థాయిలో చూశారు. మండలంలో ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగుచేశారు, ఎంత విస్తీర్ణంలో పంట ఎండిపోయే దశకు చేరింది తదితర వివరాలను కలెక్టర్ ఆరాతీశారు. అనంతరం జమాల్‌పూర్‌లోని నర్సరీని కలెక్టర్ సందర్శించారు. వచ్చే వానాకాలంలో రోడ్‌సైడ్ ప్లాంటేషన్‌కు కావాల్సిన మొక్కలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్‌కు సంబంధిత అధికారులు వివరించారు. అనంతరం స్థానిక కేజీబీవీని తనిఖీ చేశారు. పాఠశాలలో సౌకర్యాలు, బోధన వంటి అంశాలపై విద్యార్థినులతో చర్చించారు. మధ్యాహ్నభోజనం రుచి చూశారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయాధికారి యామారెడ్డి, తహసీల్దార్ రాజాగణేష్, ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, ఎంపీఓ నజీర్‌హైమద్ పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు



దేవరకద్ర రూరల్: నీటి ఎద్దడి కారణంగా ఎండుతున్న పంటలను అధికారులు పరిశీలించారు. మంగళవారం డోకూర్, గోపన్‌పల్లిలో బోరుబావులు కింద రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించి వివరాలు నమో దు చేసుకున్నారు. ఈనివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అన్నారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఏడీఏ యశ్వంత్ రావు, ఏఓ రాజేందర్ అగర్వాల్, ఆర్‌ఐ శరత్, ఏఈఓలు, పాల్గొన్నారు.

భూగర్భజలాలు అడుగంటిపోవడంపై..

హన్వాడ: మండలంలోని అంబటోనిపల్లి, ఇబ్రహీంబాద్ గ్రామాల్లో సాగునీరు లేక ఎండిన పంటలను మంగళవారం అధికారులు పరిశీలించారు. ఎండల తీవ్రత కారణంగా గతంలో ఎన్నడూ లేనంతగా ఈఏడాది ముందుగానే భూగర్భజలాలు అడుగంటిపోవడంపై అధికారులు విస్మయాన్ని వ్యక్తంచేశారు. రైతులకు నీటిపొదుపు పై అవగాహన కల్పించారు. తహసీల్దార్ కిష్యానాయక్, వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్, ఆయా గ్రామాల ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పరిశ్రమను మూసివేయాలి

రాజాపూర్: ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమను మూసివేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌నాయక్ మంగళవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు బానోత్ హుస్సేన్‌నాయక్‌కు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న స్పాంజ్‌ఐరన్ పరిశ్రమ కారణంగా 15 ఏళ్లుగా చుట్టుపక్కల గిరిజనతండాల వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పరిశ్రమను మూసివే యాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపార్టీ మండలాధ్యక్షుడు ఆనంద్ పాల్గొన్నారు.

వృద్ధులకు పింఛన్లు

నవాబుపేట: మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహరి మంగళవారం వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు అందించారు. ప్రతీనెల తన సొంత ఖర్చుల నుంచి ఒక్కొక్కరికి రూ.200 చొప్పున పింఛన్లు అందిస్తారు. 439 మందికి పింఛన్లు పంచారు. వ్యాపార సంఘం అధ్యక్షుడు సుధాకర్, పుట్టి అంజయ్య, నిరంజన్, శ్రీకాంత్, చందు, రఘు, నసీర్ వెంకటయ్య, రమేష్ ఉన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై నిర్లక్ష్యం వద్దు



సమావేశం నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

- లక్ష్యం చేరుకునేలా చర్యలు తీసుకోవాలి
- అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

జడ్చర్ల టౌన్: ఎల్‌ఆర్‌ఎస్‌పై నిర్లక్ష్యం వద్దు అని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. మార్చి 31వ తేదీ లోపు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు అన్నింటిని క్లియర్ చేసి లక్ష్యం చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం జడ్చర్ల మున్సిపాలిటీలో మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు, రియల్ వ్యాపారులు, ప్లానర్స్‌తో ఆయన వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీలో మొత్తం 17, 642 దరఖాస్తులు రాగా ఇప్పటివరకు 92మంది లబ్ధిదారులు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ సద్వినియోగం చేసుకున్నారన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో 11, 267 వాటిని క్లియరెన్స్ ఇచ్చారని, మిగిలిన దరఖాస్తులు త్వరితగతిన పరిశీలించాలని కమిషనర్, టీపీఎస్‌లను ఆదేశించారు. నిబంధనలకు లోబడి ఉంటే వాటికి సైతం ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం కల్పించాలన్నారు. ఆమోదం తెలిపిన 11, 267 దరఖాస్తు దారులకు ఫోన్‌లు చేసి ఎల్‌ఆర్‌ఎస్ కట్టుకునేలా చేయాలన్నారు. ఇందుకోసం 26మంది ఆర్పీలకు ఫోన్‌లుచేసే బాధ్యతను అప్పగించారు. ఒక్కో ఆర్పీకి 400 మంది దరఖాస్తు దారులను డివైడ్ చేసి వారి నంబర్ల ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని బిల్డింగ్ ప్లానర్లతోనూ ఆయన సమావేశం నిర్వహించారు. వారికి సంబంధించిన ప్లాటుదారులకు ఎల్‌ఆర్‌ఎస్ వల్ల కలిగే ప్రయోజనాలు వివరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, టీపీఎస్ మేఘన, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ప్రశ్నపత్రాల్లో తప్పులు

- అయోమయానికి గురైన విద్యార్థులు



తప్పులను చూపుతున్న ప్రథమ సంవత్సరం విద్యార్థినులు

జడ్చర్ల టౌన్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రశ్నపత్రాల్లో పలు అక్షరదోషాలు వచ్చాయి. మంగళవారం జరిగిన మ్యాథ్స్, సివిక్స్, బోటనీ ప్రశ్నాపత్రాల్లో తప్పులు దొర్లాయి. దీంతో విద్యార్థులు కొద్దిసేపు అయోమయానికి గురయ్యారు. అక్షరదోషాలను సరిచేసి విద్యార్థులకు చెప్పాలని అన్ని కేంద్రాల సూపరింటెండెంట్లకు ఆదేశాలు రావటంతో వాటిని సరిచేసుకోవాలని ఇన్విజిలేటర్ల ద్వారా తెలియజేశారు. బోటనీ తెలుగు మీడియం ప్రశ్నపత్రంలో 13వ ప్రశ్నకు సంబంధించి శాఖీయ అని ముద్రణ జరిగింది. వాస్తవానికి శాఖీయగా దానిని సరి చేసుకోవాలని ఆదేశాలు వచ్చాయి. అలాగే బోటనీ ఇంగ్లిష్ మీడియం ప్రశ్నాపత్రం 5వ ప్రశ్నలో ఇట్ ఈస్ బదులుగా ఈస్ ఇట్ అని ముద్రించారు. సివిక్స్‌లో 20వ ప్రశ్న జాతికి బదులుగా జాతీయత అని వచ్చింది. మ్యాథ్స్ తెలుగు మీడియంలో 4వ ప్రశ్న మాత్రిక కోటికి బదులుగా మాత్రికి శ్రేణిగా, 9వ ప్రశ్న లో ప్రమేయాన్ని బదులుగా ప్రమేయానికి అని వచ్చింది. వాస్తవానికి అక్షరదోషాలుగా చెబుతున్నప్పటికి తెలుగులో అక్షరదోషం ఎంతటి ద్వందార్థాలకు దారితీస్తుందో తెలిసిందే. ప్రశ్నపత్రాల విషయంలో ఇలాంటి నిర్లక్ష్యం తగదని విద్యార్థులు వాపోతుతన్నారు.

వివిధ పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పద్మావతి కాలనీలోని పార్కులో కమ్యూనిటీ కంపోస్టింగ్, అప్పన్నపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మొక్కల పెంపకంతో పాటు పారిశుద్ధ్య పనులను మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందికి తగు సూచనలిచ్చారు.

బాధితుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేటకి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పల్లి శివరాములు యాదవ్ ఇటీవల గుండెపోటుకు గురై ఇంటి వద్ద ఉండి కోలుకుంటున్నాడు. బాధితుడిని మంగళవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మినర్సింహాయాదవ్, నామాల మశ్చంధర్‌నాథ్, కొండయ్య ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: జగిత్యాల జిల్లాలో ఆశా కార్మికురాలిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిల్లె గోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆశా కార్యకర్తలు అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆశా కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి సాధన, కిల్లె గోపాల్ మాట్లాడారు. సభ్యసమాజం తలదించుకునేలా ఇలాంటి సంఘటన జరగడం బాధాకరమన్నారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాజ్‌కుమార్, భాగ్య, భువనేశ్వరి, మహాలక్ష్మి, నిర్మల, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధికి పెద్దపీట



రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండేడ్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రంగారెడ్డిపల్లి నుంచి గడిసింఘాపూర్ వరకు రూ.75కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, చిన్నయ్య, బాలాస్వామి, కిష్టయ్య, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లాలో కలపాలని వినతి

గండేడ్, మహమ్మదాబాద్ మండలాలను వికారాబాద్ జిల్లాలో కలపాలని ఉమ్మడి మండలాల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రాంమ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఆయన స్పందిస్తూ ఈవిషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు పాఠశాలల్లో మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని సరస్వతి శిశుమందిరంలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. చిగుళ్లపల్లి పద్మలీల, నోముల కృష్ణయ్య, రాధాకృష్ణ, వెంకటయ్య, లావణ్య పాల్గొన్నారు.

■ మిడ్జిల్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. జానకమ్మ, ప్రియాంక, పరిమళ రాణి, కృష్ణమ్మ, నర్సింహులు, గోపాల్ పాల్గొన్నారు.



మిడ్జిల్‌లోని ప్రాథమిక పాఠశాలలో..

■ 'చలువ'బడుతున్న కష్టం



ఈ పందిరిని చూడగానే మనందరికీ గుర్తుకు వచ్చేది పెళ్లి పందిరి. కానీ ఇది మాత్రం 'ఉపాధి' పనులు చేసే కూలీల కోసం ఏర్పాటుచేసిన చలువ పందిరి. ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం మంగళవారం మల్కాపూర్‌లో కూలీలు పచ్చని ఆకులతో పందిరి ఏర్పాటు చేసుకున్నారు. ఎండలో కష్టపడి వచ్చి ఈ పందిరిలో 'చలువ'బడుతున్నారు. – నవాబుపేట

చట్టాలపై అవగాహనతో సమస్యలకు పరిష్కారం

డీఎస్పీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల టౌన్: చట్టాలపై అవగాహనతో సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతోందని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం బాదేపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో షీటీం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలల కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. బాల్య వివాహాలు చేసుకోరాదని, మన పరిసరాల్లో అలా ఎవరైనా చిన్నవయసులోనే వివాహాలు చేస్తుంటే మనకెందుకులే అని ఊరుకోకుండా అధికారులకు సమాచారం అందించాలన్నారు. గృహహింసకు పాల్పడినా ఫిర్యాదులు చేయవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని అవగాహన కల్పించారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే గురువులు, తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. ఆదిలోనే సమస్య పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆసక్తి పెంపొందించే ప్రకటనలు చాలా వస్తుంటాయని, వాటిపట్ల మక్కువ పెంచుకోరాదని సూచించారు. చదువుపైనే దృష్టి సారించి లక్ష్యం ఏర్పరుచుకొని, దానిని సాధించేందుకు ప్రణాళికలు వేసుకోవాలన్నారు. హెచ్‌ఎం చంద్రకళ, సీఐ కమలాకర్, షీటీం ఇన్‌చార్జి వనజారెడ్డి, డా.సౌజన్యతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోవాలి



ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ పత్రాలు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఫంక్షన్ హాల్స్ నిర్వాహకులు తమ ట్రేడ్ లైసెన్స్‌ను రెన్యూవల్ చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోవటంతో మంగళవారం వారికి రసీదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేష్ ఉన్నారు.

ముగిసిన బసవేశ్వరస్వామి ఉత్సవాలు



కోటచింతల దేవాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

నవాబుపేట: కోటచింతల బసవేశ్వర స్వామి ఉత్సవాల్లో బాగంగా మంగళవారం రుద్రాభిషేకం నిర్వహించి మంగళహారతితో ఉత్సవాలు ముగించారు. ఈ సందర్భంగా వేదమంత్రాల మధ్య భక్తుల కోలాహలంతో బిల్వ పత్రితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మార్కెట్ వైస్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, రాజేష్, సిద్ధయ్య, చారి, నరేందర్, మాజీ సర్పంచులు పాండు, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మిడ్జిల్: మండలంలోని వస్పులలో ఈఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను మంశవారం బీజేపీ గిరిజన మోర్చ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ నిధులతో చాలా గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధియే మోదీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు నరేష్‌నాయక్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, నాయకులు కృష్ణారెడ్డి, శేఖర్, సురేందర్ పాల్గొన్నారు.

లక్ష్యంపై దృష్టి పెట్టి చదవాలి



మహబూబ్‌నగర్ రూరల్: విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టి చదవాలని ఎస్‌ఐ నరేష్ అన్నారు. మంగళవారం గాజులపేట గ్రామంలో పీఎంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రోజంతా కష్టపడి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు తమ అలసట తీర్చుకునేందుకు పిల్లల చేతనే దుకాణానికి పంపించి కొన్ని మత్తు పానీయాలను తెప్పించుకోవడంతో పిల్లలు వాటిని అలవాటు చేసుకునే ప్రమాదం ఉందన్నారు. తెలిసీ తెలియని వయసులో పిల్లల చేతిలో సెల్‌ఫోన్లు ఉండటంతో మంచి కంటే చెడు సమాచారాన్ని చూడడంవల్ల యుక్త వయస్సు రాకముందే వ్యామోహంలో పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. అనంతరం పోలీసు సురక్ష కళాజాత బృందం తమ నృత్య ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఏఎస్‌ఐ భూపాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాములు, జగదీష్, శ్రీనివాసులు, శివరాములు, పీఎంశ్రీ పాఠశాల హెచ్‌ఎం యాదయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దేవేంద్రమ్మ, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, రొట్టె నర్సింహులు, కోస్గి సతీష్‌కుమార్, మునయ్య, రమేష్ పాల్గొన్నారు.

హక్కులను కాలరాసేందుకు కుట్ర

స్టేషన్ మహబూబ్‌నగర్: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో ముస్లిం మైనార్టీల హక్కులను కాలరాసేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మైనార్టీలపై కక్ష సాధింపు చర్యలో భాగంగా ఈబిల్లును తీసుకు వస్తుందని పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డు సవరణచట్టంను వ్యతిరేకిస్తూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని ఆయన కోరారు.